సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం : 8 : ఫిబ్రవరి : 2023





**ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలకు సర్వం సిద్ధం**

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఎఫ్ఏ-3 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. - 8లో



**నగరవనానికి రూ. 1.20 కోట్లు మంజూరు**

ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో ఏర్పాటు చేయనున్న నగరవనానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరైనట్లు సీసీఎఫ్ రామకృష్ణ తెలిపారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.1 /19.5

**వాతావరణం**

జిల్లాలో మంగళవారం 19.5 - 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

## న్యూస్‌రీల్

### 12న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఈనెల 12న వైఎస్సార్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మేరీ సుప్రియ, సెక్రటరీ వెంకటరమణ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు 2003 జనవరి 2 తర్వాత పుట్టిన వారు మాత్రమే అర్హులని వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని కోరారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపికలను నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో ప్రతిభకనబరిచిన వారిని నెల్లూరు జిల్లా కావలిలో మార్చి 5, 6, 7 తేదీల్లో నిర్వహించే అంతర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 9160122588, 7036907303 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ఉత్తీర్ణత శాతం పెంచాలి



విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలిస్తున్న జేడీ జయప్రకాష్

చక్రాయపేట : విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచడమే కాకుండా ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన చక్రాయపేటలోని ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. వారి నైపుణ్యాన్ని పరీక్షించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 60 హాస్టళ్లలో 10 మినహా అన్నింటికీ సొంత భవనాలున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మోటివేషన్ క్లాసులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో రామాంజనేయులు, వార్డెన్ కేశవ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : కడప నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ప్రధాన కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఆసక్తి, అర్హత గలవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ సి.సాయిగ్రేస్ తెలిపారు. వైద్యశాస్త్రంలో పీజీ డిగ్రీ, ఎండీ ప్యాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ కలిగి ఉండాలని లేదా వైద్యశాస్త్రంలో డిగ్రీ, పైథాలజీలో డిప్లొమా, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్‌లో తగిన అవగాహన, బ్లడ్ గ్రూపింగ్ సిరాలజీ, మెథడాలజీ, కాంపోనెంట్స్ ప్రిపరేషన్ చేయగలిగి ఉండాలని సూచించారు. అర్హులైన వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 15వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా నగరంలోని మట్టిపెద్దపులి వద్ద గల రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి రూ. 30 వేల వేతనం ఉంటుందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో అభ్యర్థి ఎంపిక ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 08562-272829 నంబరులో సంప్రదించాలన్నారు.



# ఎర్రబంగారం.. విక్రయానికి సన్నాహం



- ఏపీఎఫ్‌డీసీ ద్వారా గ్లోబల్ టెండర్లు
- గోడౌన్‌లో సిద్ధంగా ఉన్న 10వేల టన్నుల నిల్వలు
- 5300 టన్నులు విక్రయానికి సిద్ధం
- ఖజానాకు చేరనున్న కోట్లాది రూపాయలు
- అందులో 30 శాతం ఎర్రచందనం అడవుల రక్షణ కోసం వెచ్చింపు

సాక్షి ప్రతినిధి, కడప : అంతర్జాతీయ స్థాయిలో అత్యంత విలువైన ఎర్రచందనం విక్రయానికి సన్నాహాలు ఆరంభమయ్యాయి. కోట్లాది రూపాయల విలువైన ఎర్రబంగారం సంవత్సరాల తరబడి గోడౌన్‌కు పరిమితమైంది. ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలలో స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఎర్రచందనాన్ని విక్రయించేందుకు ఐదేళ్ల క్రితం అధికార యంత్రాంగం సిద్ధమైంది. కడప పరిధిలో ఉన్న ఎర్రచందనాన్ని డ్రెస్సింగ్ చేసి తిరుపతికి తరలించారు. రెండు జిల్లాలకు చెందిన ఎర్రచందనం నిల్వలు 10వేల టన్నులు పైబడి సిద్ధంగా ఉన్నాయి. అందులో తొలి విడతగా 5300 టన్నులు విక్రయించాలని ఫారెస్టు యంత్రాంగం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎఫ్‌డీసీ) ద్వారా గ్లోబల్ టెండర్లు ఆహ్వానించేందుకు ప్రక్రియ ప్రారంభించారు. వృథాగా పడిఉన్న ఎర్రచందనం నిల్వలను విక్రయించాలనే ఆలోచన గత ఐదేళ్లుగా కొనసాగుతోంది. 2014 నుంచి పట్టుబడ్డ ఎర్రచందనాన్ని డ్రెస్సింగ్ చేసి తిరుపతికి తరలించి ప్రత్యేక గోడౌన్లలో ఉంచి భద్రపర్చారు. గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించింది. గ్లోబల్ టెండర్ల నిర్వహణకు అన్ని అనుమతులు పూర్తి చేసుకున్నట్లు అధికార యంత్రాంగం వివరిస్తోంది. ఆమేరకు ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

**రూ.500 కోట్లు ఆదాయం..**

గ్లోబల్ టెండర్ల ద్వారా తొలివిడతలో విక్రయానికి పెట్టిన ఎర్రచందనం నిల్వలతో సుమారు రూ.500 కోట్లు ఆదాయం ఖజానాకు దక్కవచ్చని అధికారులు అంచనా వేశారు. గ్లోబల్ టెండర్లలో పోటీ అధికంగా ఉంటే మరింత అదనంగా ఆదాయం రానున్నట్లు లెక్కకట్టారు. ప్రస్తుతం ఏ గ్రేడ్ ఎర్రచందనం రూ.2కోట్లు తక్కువ లేకుండా ధర పలకనున్నట్లు సమాచారం. బి గ్రేడ్ రూ.1కోటి, సి గ్రేడ్ రూ.50 లక్షలు ధర దక్కుతోందనేది అంచనా. ప్రస్తుత నిల్వల్లో సరాసరిగా పరిశీలిస్తే రూ.500 కోట్లకు తక్కువ కాకుండా ఖజానాకు సమకూరనున్నట్లు తెలుస్తోంది.

**ఎర్రచందనం రక్షణ కోసం..**

గ్లోబల్ టెండర్ల ద్వారా లభించే ఆదాయంలో నిబంధనల ప్రకారం 30శాతం ఎర్రచందనం అడవుల రక్షణ కోసం కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత అంచనా ఆధారంగా ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలకు సుమారు రూ.75 కోట్లు అడవుల రక్షణకు నిధులు దక్కనున్నట్లు ఫారెస్టు యంత్రాంగం పేర్కొంటోంది.



# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**కలెక్టర్ విజయ రామరాజు**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : ఈ విద్యా సంవత్సరం 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి విద్యా ప్రమాణాల పెంపు, మనబడి నాడు - నేడు ఫేజ్-2 పనుల పురోగతిపై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

**పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి**

ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టి 100 శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులకు సూచించారు. నాణ్యమైన విద్యను అందించి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. పదవ తరగతి సిలబస్ త్వరితగతిన పూర్తి చేసి రివిజన్ చేపట్టాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం అదనపు తరగతులు తీసుకొని చదువులో రాణించేలా చూడాలన్నారు. 100 శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే వైఎస్సార్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని తెలిపారు.

**ఫేజ్- 2 పనులను సకాలంలో పూర్తి చేయాలి**

రెండవ దశ నాడు - నేడు పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో నాణ్యతా లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. మండల స్థాయిలో విద్యాశాఖాధికారి, ఇంజినీరింగ్ అధికారి ఎప్పటికప్పుడు ప్రతి పనిని తనిఖీ చేస్తూ నివేదికలు అందించాలన్నారు. మొదటి దశ నాడు - నేడు అభివృద్ధి పనుల ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రెండవ దశ పనుల నిర్వహణలో వైఎస్సార్ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ దేవరాజు, సమగ్ర శిక్ష పీడీ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసుల రెడ్డి, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

**పులివెందుల మోడల్ టౌన్‌పై కలెక్టర్ సమీక్ష**

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ విజయరామరాజు సమీక్ష నిర్వహించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మోడల్ టౌన్‌లో భాగంగా 19 అంశాలకు సంబంధించి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. కదిరి రోడ్డు, గరండాల్ బ్రిడ్జి, నగర వనం, సిటీ సెంటర్, న్యాక్ అభివృద్ధి సంస్థ పనులు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. సీఎం వైఎస్ జగన్ పులివెందుల పర్యటనకు వచ్చే నాటికి అభివృద్ధి పనులను పూరి చేయాలన్నారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# అనుడ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు



సమావేశంలో మాట్లాడుతున్న అనుడ వైస్ చైర్మన్ వైఓ నందన్

కడప కార్పొరేషన్ : అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని 10 మున్సిపాలిటీలు, అన్ని పంచాయితీల్లో భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చే ప్రక్రియ ఆన్‌లైన్‌లో పారదర్శకంగా జరుగుతుందని అనుడ వైస్ చైర్మన్ వైఓ నందన్ తెలిపారు. మంగళవారం కడప కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 చ.మీ కంటే తక్కువ స్థలం ఉన్న వారు పంచాయితీ సెక్రటరీ పరిధిలోనే బిల్డింగ్ అనుమతులు పొందవచ్చని, ఆ పైన ఉన్నవారికి అనుడ పరిధిలో అనుమతులు జారీ చేస్తామన్నారు. అంతకుముందు బిల్డింగ్ ప్లాన్ ప్రక్రియకు సంబంధించి ఎంట్రో ల్యాబ్స్‌చే అభివృద్ధి చేయబడ్డ వెబ్ అప్లికేషన్‌పై ఎల్‌టీపీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీలక్ష్మి, ఏపీవో క్రిష్ణసింగ్, కేఎంసీ సీపీ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

# 'అయోడిన్ ఉప్పుతో ఎన్నో ప్రయోజనాలు'



ఆశా వర్కర్లనుద్దేశించి మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

ఖాజీపేట : అయోడిన్ ఉప్పు వాడటం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఉపయోగించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు అన్నారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంహెచఓ మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. శరీరానికి కావాల్సిన సూక్ష్మపోషకం లభిస్తుందన్నారు. గర్భిణులకు గర్భస్రావం జరగదని.. మృత శిశువులు, నెలలు నిండకుండా ప్రసవాలుండవన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట వైద్యాధికారి ముబిన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప అధికారి ఉమా మహేశ్వర్‌కుమార్, ఆరోగ్య శాఖ ఎపిడమాలజిస్టు ఖాజా, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, నాగభూషణంతో పాటు స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేషనల్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌కు రెండు స్కూళ్లు

వాల్మీకిపురం : నేషనల్ గ్రీన్‌కోర్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో 2022-23 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్‌కు అన్నమయ్య జిల్లా నుంచి రెండు స్కూళ్లు ఎంపికయ్యాయి. మన రాష్ట్రం నుంచి ఉత్తమంగా నిలిచిన 10 పాఠశాలల్లో వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ములకలచెరువు మండలం బురకాయలకోట ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ఉండటం విశేషం. పర్యావరణానికి సంబంధించి ఈ రెండు పాఠశాలలు శ్రద్ధతో ఎక్కువ కార్యక్రమాలు చేపట్టడంతో ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించినట్లు పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం అమరనాథ రెడ్డి, పర్యావరణ విభాగం ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలో ఆయా పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ అవార్డులను అందుకోనున్నారు. జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవ రెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు క్రిష్ణప్ప, వరలక్ష్మి, రాష్ట్ర ఎన్జీసీ కో-ఆర్డినేటర్ నీలకంఠ, జిల్లా ఎన్జీసీ కో-ఆర్డినేటర్ చక్రధర్ రాజు తదితరులు అభినందించారు.

### నేడు జిల్లాకు మైనారిటీ కమిషన్ సభ్యురాలి రాక

కడప సిటీ : జాతీయ మైనారిటీ కమిషన్ మెంబర్ సయ్యద్ షెహజాది బుధవారం జిల్లాకు రానున్నట్లు, ఆమె వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కృష్ణ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు కడపలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మైనారిటీ పెద్దలతో ఆమె సమావేశం కానున్నారని తెలిపారు. జిల్లాలోని మైనారిటీ పెద్దలు ఈ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారని వివరించారు.

### నవోదయ పరీక్షకు గడువు పెంపు

రాయచోటి టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవడానికి 15వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# 'ఉపాధి' తీరు బాగుంది



ఉపాధి పనుల బోర్డును పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకులు

ఖాజీపేట : 'ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులు బాగున్నాయి.. కూలీలకు చక్కగా ఉపాధి లభిస్తోంది' అని క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు సీసీఆర్ సాహు, సత్యవ్రత బెహ్రాలు అన్నారు. ఖాజీపేట మండలంలో అప్పనపల్లె, కూనవారిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం వారు పరిశీలించారు. కూలీలతో నేరుగా మాట్లాడారు. అనంతరం డ్వాక్రా మహిళలతో సమావేశం అయ్యారు. వారికి అందే పథకాలు, బ్యాంకుల ద్వారా తీసుకుంటున్న రుణాల ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ల పంపిణీ ఎలా ఉంది. తీసుకుంటున్న డబ్బు వినియోగం, కలిగే ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపీఓ వరప్రసాద్‌తో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# ఊపందుకున్న ఉపాధి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- లక్ష్య సాధన దిశగా పనిదినాలు
- ఇప్పటివరకు కూలీలకు రూ. 139 కోట్లు ఖర్చు
- మెటీరియల్‌కు రూ. 65 కోట్లు
- ప్రస్తుతం పనిదినాలు రూ. 79 లక్షలకు గాను రూ. 63 లక్షలు పూర్తి

| | |
|---|---|
| జిల్లాలోని మండలాలు | 35 |
| ఉపాధి పనులు జరుగుతున్న పంచాయితీలు | 563 |
| పనులు చేపట్టిన గ్రామాలు | 1932 |
| మొత్తం జాబ్ కార్డులు | 2,01,052 |
| మొత్తం కూలీలు | 3,46,519 |
| 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు | 2830 |
| ఇప్పటివరకు నమోదైన పనిదినాలు | 63 లక్షలు |
| మొత్తం బడ్జెట్ | రూ. 320 కోట్లు |
| ఇందులో కూలీలకు చెల్లించిన మొత్తం | రూ. 139 కోట్లు |
| మెటీరియల్, ఇతర సామగ్రికి | రూ. 65 కోట్లు |

కడప సిటీ : జిల్లాలో ఉపాధి పనులు మరింత వేగంగా కొనసాగుతున్నాయి. కూలీల పనిదినాలు ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాన్ని అధిగమించారు. మొత్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి చివరి నాటికి 79 లక్షల పనిదినాలు నమోదు కావాల్సి ఉంది. అయితే ఫిబ్రవరి మొదటి వారానికే 63 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. ఇక కేవలం 16 లక్షల పనిదినాలు నమోదైతే లక్ష్యాన్ని పూర్తి చేసినట్లవుతుంది. లక్ష్య సాధన దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం రోజుకు 25 వేల మంది కూలీలు పనులకు హాజరవుతుండగా ఈ సంఖ్యను 50 వేలకు పెంచి మార్చి చివరి నాటికి ముందే లక్ష్యాన్ని ఛేదించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం మొత్తం బడ్జెట్ రూ. 320 కోట్లు కాగా, ఇందులో కూలీల ఖర్చుకు రూ. 203 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 63 లక్షల పనిదినాలకు రూ. 139 కోట్లు ఖర్చు చేశారు. అలాగే భవన నిర్మాణ పనులకు (మెటీరియల్స్) రూ. 135 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ. 65 కోట్లు ఖర్చు చేశారు. మార్చి నెలాఖరు నాటికి మిగిలిన పనులను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**35 మండలాలు.. 563 గ్రామ పంచాయతీల్లో..**

జిల్లాలోని 35 మండలాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. 563 గ్రామ పంచాయతీల్లోని 1932 గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు వివిధ పనులను చేశారు. ప్రధానంగా నీటి సంరక్షణ పనులైన కందకాలు, కేసీ కెనాల్‌లో పూడికతీత, కాలువల్లో పూడికతీత, చెరువుల్లో మరమ్మతులు, ప్లాంటేషన్ తదితర పనులను కూలీల ద్వారా ఉపాధి హామీలో చేపట్టారు.

**రోజుకు 25 వేల మంది హాజరు**

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు ప్రస్తుతం రోజుకు 25 వేల మంది కూలీలు హాజరవుతున్నారు. ఇందులో కనీస వేతనం రూ. 257 కాగా, ప్రస్తుతం రోజుకు రూ. 250 ఉపాధి కూలీ వస్తోంది. మొత్తం మార్చి చివరి నాటికి 79 లక్షల పనిదినాలు నమోదు కావాల్సి ఉండగా, ఈ ఫిబ్రవరి మొదటి వారానికే 63 లక్షల పనిదినాలు నమోదయ్యాయి. ఇందుకుగాను రూ. 139 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా మిగిలిన రూ. 16 లక్షలు ఈ మార్చి చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అంటే లక్ష్య సాధన దిశగా జిల్లాలోని ఉపాధి హామీ పథకం ముందుకు నడుస్తోంది.

**మెటీరియల్‌కు రూ. 65 కోట్లు**

ఉపాధి హామీ పనుల్లో భాగంగా భవన నిర్మాణ పనులకు (మెటీరియల్)కు మొత్తం గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి చివరి నాటికి రూ. 135 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇప్పటికి రూ. 65 కోట్లు ఖర్చు చేశారు. ఈ మొత్తాన్ని భవన నిర్మాణానికి అవసరమైన సామగ్రితోపాటు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు సంబంధించి ఉపాధి పనులు చేపట్టారు. ఉపాధిలో హౌసింగ్ పనులకు 90 రోజుల పనిదినాలను కూలీలకు కేటాయించారు. మిగతా పది రోజులు మాత్రం ఇతర పనులు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

**వంద రోజులు పనిదినాలు దాటిన కుటుంబాలు 2830**

జిల్లాలో ప్రస్తుతం వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు 2830 ఉన్నాయి. 81-99 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 19,100, 70-80 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 10,848 కుటుంబాలు, 61-70 పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు 10,966 కుటుంబాలు ఉన్నాయి.

**ప్రణాళిక ప్రకారం ముందుకు వెళతాం**



ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకంలో వివిధ పనులు జరుగుతున్నాయి. అయితే ప్రారంభం నుంచి ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నాం. అందుకే లక్ష్య సాధన దిశగా పనిదినాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. మార్చి చివరి నాటికి నిర్ణయించుకున్న మేరకు లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తున్నాం.

– పి.యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా,కడప

## క్లుప్తంగా

### సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలి


కడప వైఎస్సార్‌ సర్కిల్‌ : సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు రీజియన్‌ పోస్టల్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ సురేష్‌ కుమార్‌ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పోస్టల్‌ ప్రధాన కార్యాలయంలో బ్రాంచ్‌ పోస్టర్లు, పోస్ట్‌మెన్లకు సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాలికలు ఉన్న కుటుంబంలో సుకన్య సమృద్ధి యోజన ఖాతాను ఓపెన్‌ చేయించాలన్నారు. పదేళ్ల వయసు ఉన్న ఆడ పిల్లలు రూ. 250తో ఖాతా ప్రారంభించవచ్చన్నారు. ఒక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు డిపాజిట్‌ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కడప డివిజన్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ గౌస్‌ ఆజామ్‌, అసిస్టెంట్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌లు న్యామతుల్లా, విజయ్‌ భాస్కర్‌, రామశంకరరెడ్డి, బాషా, పీఎల్‌ఐ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ మునాఫ్‌ పాల్గొన్నారు.

### స్పెషల్‌ డ్రైవ్‌లో 230 కేసులు

కడప అర్బన్‌ : జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్‌ డ్రైవ్‌లో మంగళవారం మొత్తం 230 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ తెలియజేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్‌ ధరించకుండా వాహనాలు నడిపిన 222 మందిపై, సీటు బెల్ట్‌ ధరించకుండా వెళుతున్న కార్లు, జీపులు, తదితర వాహనాలకు సంబంధించి 8 మందిపై కేసులు నమోదు చేశారు.

# ఫార్మెటివ్‌ అసెస్‌మెంట్‌-3 పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు
- పాఠశాలలకు గంట ముందు ప్రశ్నాపత్రం అందజేత



పరీక్షకు సిద్ధమౌతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్‌ : వైఎస్సార్‌ ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఫార్మెటివ్‌ అసెస్‌మెంట్‌-3(ఎఫ్‌ఏ-3) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి విడుదల చేసింది. ఈ పరీక్షలను ఈ నెల 10వ తేదీ వరకు రెండు పూటలా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను, ఓఎంఆర్‌ షీట్స్‌ను కడప డీసీఈబీ నుంచి అన్ని మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరవేశారు. సంబంధిత ప్రశ్నాపత్రాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తేదీల వారీగా ఎమ్మార్సీ కార్యాలయంలోని ట్రంక్‌ పెట్టెల్లో భద్రపరచుకోన్నారు. పరీక్షల ప్రశ్నాపత్రాలను ఏ రోజుకారోజున ఒక గంట ముందు మాత్రమే.. ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలి. ప్రశ్నాపత్రాల లీకేజీకి తావు లేకుండా అన్ని జాగ్రత్తలను తీసుకున్నారు.

**3,89,682 మంది విద్యార్థులు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలుపుకొని 3,89,682 మంది విద్యార్థులు ఈ ఫార్మెటివ్‌ అసెస్‌మెంట్‌ పరీక్షను రాయనున్నారు. ఇందులో 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు క్లాస్‌ రూమ్‌ బేస్‌ అసెస్‌మెంట్‌ విధానంలో ఓఎమ్మార్‌ షీట్‌లో పరీక్షను రాయాల్సి ఉండగా.. మిగతా 9, 10 తరగతుల పరీక్షలను మ్యానువల్‌ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఇందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం సెషన్‌లో 10 గంటల నుంచి 11 వరకు మధ్యాహ్న సెషన్‌లో 2 నుంచి 3 వరకు పరీక్ష ఉంటుంది. అలాగే 6, 7, 8 తరగతులకు మాత్రం మొదటి సెషన్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 వరకు, రెండవ సెషన్‌లో 3 నుంచి 4 వరకు ఉంటుంది. అలాగే 9, 10 తరగతులకు ఉదయం మొదటి సెషన్‌లో 9.30 నుంచి 10.15 వరకు, రెండవ సెషన్‌లో 11 నుంచి 11.45 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

| 1 నుంచి 5వ తరగతి వరకు | | |
|---|---|---|
| పరీక్ష తేదీ | సెషన్‌-1 | సెషన్‌ 2 |
| | 10 ఏఎం-11ఏఎం | 2 పీఎం-3 పీఎం |
| 8.2.23 | తెలుగు | మ్యాథ్స్‌ |
| 9.2.23 | ఇంగ్లిషు | ఎన్విరాన్‌మెంట్‌ సైన్స్‌ |
| 6 నుంచి 8వ తరగతి వరకు | | |
| పరీక్ష తేదీ | సెషన్‌-2 | సెషన్‌-2 |
| | 1.30 పీఎం-2.30 పీఎం | 3 పీఎం-4 పీఎం |
| 8.2.23 | తెలుగు | మ్యాథ్స్‌ |
| 9.3.23 | హిందీ | జనరల్‌ సైన్సు |
| 10.2.23 | ఇంగ్లిషు | సోషియల్‌ స్టడీ |
| 9, 10 తరగతులు | | |
| పరీక్ష తేదీ | సెషన్‌-2 | సెషన్‌ -2 |
| | 9.30 ఏఎం-10.15 ఏఎం | 11 ఏఎం - 11.45 ఏఎం |
| 8.2.23 | తెలుగు | మ్యాథ్స్‌ |
| 9.2.23 | హిందీ | జనరల్‌ సైన్సు |
| 10.2.23 | ఇంగ్లిషు | సోషియల్‌ స్టడీ |

**ఎంఈఓ కార్యాలయాలకు**

ఫార్మెటివ్‌ అసెస్‌మెంట్‌-3 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్‌ సీటు లను అన్ని మండల కేంద్రాలకు చేర్చాము. వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తేదీల వారీగా ట్రంకు పెట్టెల్లో భద్రపరచుకోవాలి. పరీక్ష ప్రారంభానికి గంట ముందు మాత్రమే ప్రశ్నాపత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి.

\- శోభారాణి, డీసీఈబీ సెక్రటరీ, కడప



**ఆరోపణలకు తావులేకుండా**

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఫార్మెటివ్‌ అసెస్‌మెంట్‌-3 పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి. ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని జరపాలి. పొరపాట్లు జరిగితే చ్యలు కఠినంగా ఉంటాయి.

\- చెప్పలి దేవరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి, వైఎస్సార్‌ జిల్లా



### సైబర్‌ నేరాలపై అప్రమత్తత అవసరం

కడప అర్బన్‌ : సైబర్‌ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ తెలిపారు. ఆయన మంగళవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇంటి వద్దనే వుంటూ ఉద్యోగాలు చేస్తూ రోజుకు వేలాది రూపాయలు సంపాదించండి.. అంటూ వచ్చే మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. యూ ట్యూబ్‌లో యాడ్‌ ప్రమోషన్‌ ఉద్యోగం పేరిట ఘరానా మోసాలకు తెగబడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లోన్‌ యాప్‌ల ద్వారా లోన్‌ తీసుకోకుంటే మంచిదన్నారు. బ్యాంక్‌ ఖాతాతోపాటు ఇతర విలువైన వ్యక్తిగత సమాచారాన్ని ఎవ్వరితో షేర్‌ చేయవద్దని వివరించారు.

### ప్రతి వాహనానికి రేడియం స్టిక్కర్‌ అతికించుకోవాలి

కడప వైఎస్సార్‌ సర్కిల్‌ : ప్రతి వాహనానికి రేడియం స్టిక్కర్‌ అతికించుకోవాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌ ఇ.మీరా ప్రసాద్‌ పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేడియం స్టిక్కర్‌ను అతికించుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కాలం చెల్లిన వాహనాలు, స్క్రాప్‌ వేసిన వాహనాదారులు తమ వాహన రిజిస్ట్రేషన్‌ రద్దు చేసుకోవాలని తెలిపారు. వాహనాదారులు తమ పేరిట రిజిస్ట్రేషన్‌ రద్దు చేయించుకోకుంటే పన్నులు వస్తూనే ఉంటాయన్నారు.



# కల్యాణ వైభోగమే

వైభవంగా శ్రీ దుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవం

కడప కల్చరల్‌ : కడప నగరానికి చెందిన శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 21వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీ విజయదుర్గాదేవి, మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అస్థాన గాయకుడు కల్యాణ గీతాలను ఆలపిస్తుండగా, నాదస్వర విద్వాంసుల కల్యాణ రాగాల మధ్య కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు 25 కలశాలలోని పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. యాగశాలలో చండీహోమం, ఆలయ మండపంలో నవావరణ శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మల్లికార్జునస్వామి, విజయ దుర్గమ్మల ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌, కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో అర్చకుల బృందం కల్యాణ క్రతువును నిర్వహించారు. కల్యాణానికి వేదపండితులు రాయపెద్ది సుబ్బరామశర్మ వ్యాఖ్యానం ఆసక్తిగా సాగింది. టీటీడీ కళాకారులు అమ్మవారి భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు అందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**ఊరేగింపు**

కల్యాణం అనంతరం రాత్రి నూతన దంపతులు శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాగంణంలో వీధుల్లో రంగురంగుల విద్యుత్‌ దీపాల మధ్య అలంకరించిన పూల రథంపై స్వామి, అమ్మవార్లు భక్తులను కటాక్షించారు.



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

# అసమర్థుడి ప్రయాణంలా ఉంది

- లోకేష్‌కు పొలిటికల్‌ గ్లామర్‌ లేదు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : లోకేష్‌ పాదయాత్ర అసమర్థుడి ప్రయాణంలా ఉందని, చరిత్రలో ఇంత దారుణంగా విఫలమైన పాదయాత్ర లేదని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి అన్నారు. కోఆపరేటివ్‌ స్టోర్‌ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో వైఎస్‌ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి, తాజాగా రాహుల్‌ గాంధీ పాదయాత్ర చేశారని, అయితే ఇంత అధ్వానంగా ఎవరి యాత్ర సాగలేదన్నారు. లోకేష్‌ పాదయాత్ర పూర్తిగా పలుచబడిందని జనం చెప్పుకుంటున్నారన్నారు. ప్రజల మద్దతు, పొలిటికల్‌ గ్లామర్‌, తెలుగు భాషపై పట్టు లేకపోవడం, ప్రసంగాలు చేయకపోవడం పాదయాత్ర విఫలమవడానికి కారణమని అన్నారు. సాధారణంగా సీఎం అభ్యర్థులు గతంలో పాదయాత్ర చేసి ముఖ్యమంత్రులు అయ్యారని, అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి అభ్యర్థి కాని లోకేష్‌ యాత్ర చేపట్టారన్నారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీపై అసంతృప్తి లేకపోవడం కూడా లోకేష్‌ పాదయాత్ర సక్సెస్‌ కాకపోవడానికి కారణమని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

# ప్రపంచానికి మార్గదర్శి మరియమాత



దైవ సందేశం అందజేస్తున్న ఫాదర్‌ బెన్ని

కడప కల్చరల్‌ : ప్రపంచ మానవాళికి మరియమాత మార్గదర్శకురాలని, ఆమెను ఆరాధించి మన విశ్వాసాన్ని చాటుకోవాలని ఏలూరు జ్ఞాన కేంద్రం డైరెక్టర్‌ ఫాదర్‌ బెన్ని అన్నారు. కడప నగరం మరియాపురం పాత చర్చి వద్ద నిర్వహిస్తున్న లూర్దుమాత తిరునాలలో ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మిక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రధాన ప్రసంగం చేశారు. తొలుత చిత్తూరు విచారణ గురువు ఫాదర్‌ సగిలి ప్రకాశ్‌ దివ్య బలిపూజ సమర్పించారు. ఈ సందర్భంగా తొలుత మరియాపురం వీధుల్లో మరియమాత స్వరూపాన్ని పల్లకీపై ఉంచి విశ్వాసులు ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు తెచ్చారు. అక్కడ ప్రత్యేక అలంకారం చేసి మాత స్వరూపాన్ని ఏర్పాటు చేశారు. చిత్తూరు విచారణ గురువులు సగిలి ప్రకాశ్‌ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాధి జోసెఫ్‌, ఉపాధ్యక్షులు పి.వి జయ్‌కుమార్‌, కార్యదర్శి లూర్దు, కోశాధికారి యు.విజయ్‌కుమార్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నంది మండలం విజయరాజు ఆధ్వర్యంలో క్రైస్తవ మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. విమల సిస్టర్స్‌ పీఠం అలంకరణ చేయడంతోపాటు పెద్ద చర్చి గాయక బృందంతో కలిసి స్తుతి గీతాలు ఆలపించారు.



### 'జగన్నాథుని జనయాత్ర' ఆవిష్కరణ



పుస్తకాన్ని పరిశీలిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌: చిత్రంలో మేయర్‌ సురేష్‌బాబు, రవిశంకర్‌రెడ్డి

కడప కార్పొరేషన్‌ : వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ సేవాదళ్‌ స్టేట్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాచమల్లు రవిశంకర్‌ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన 'జగన్నాథుని జనయాత్ర' పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కడప మేయర్‌ సురేష్‌ బాబుతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాచమల్లు రవి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్షల మంది ప్రజానీకంతో మమేకమై వయో, వర్గ, వర్ణ భేదం లేకుండా కలిసిపోయిన 'ప్రజా సంకల్ప యాత్ర'కు సచిత్ర రూపమే ఈ 'జగన్నాథుని జనయాత్ర' అని తెలిపారు. మనసు కదిలించే వెతలు, మరెన్నో ఆత్మీయ అనుభూతులు, యాత్ర సాగిన తీరు ఇలా ప్రతి అంశం ఇందులో పొందుపరిచామన్నారు. భావి రాజకీయ నాయకులకు ఈ పుస్తకం దిక్సూచిలా ఉపయోగపడగలదని విశ్వసిస్తున్నానన్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని అరుదైన పిల్లి మృతి



గుర్తు తెలియని వాహనం తగిలి మృతి చెందిన అరుదైన పిల్లి

అట్లూరు : కడప–బద్వేలు ప్రధాన రహదారిపై సిద్దవటం టౌన్‌ బీటు పరిధిలో మంగళవారం గుర్తు తెలియని వాహనం తగిలి అరుదైన పిల్లి మృత్యువాత పడింది. దీనికి చిరుతపులి లాగా మచ్చలు, చారలు ఉండటంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు పులిపిల్ల మృత్యువాత పడిందనుకున్నారు. ఈ విషయమై సిద్దవటం రేంజ్‌ అధికారి ప్రసాద్‌ను వివరణ అడుగగా అడవిలో సంచరించే రుస్టి స్పాటెడ్‌ క్యాట్‌ అనే అరుదైన పిల్లి అని తెలిపారు.

### కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన కారు

చాపాడు : ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలోని చాపాడు మండలం విశ్వనాథపురం గ్రామం వద్ద మంగళవారం కారు బోల్తా పడింది. ప్రకాశం జిల్లాకు చెందిన వినయ్‌, బాబు, ధర్మేంద్ర పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు కారులో పులివెందుల వెళ్లి మైదుకూరు వస్తున్నారు. ఈ క్రమంలో విశ్వనాథపురం వద్ద రోడ్డుపై ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. చాపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

### రైతు ఆత్మహత్యాయత్నం

దువ్వూరు : దువ్వూరులోని తహసీల్దార్‌ కార్యాలయంలో మంగళవారం రైతు తిప్పలూరు నాగిరెడ్డి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతన్ని వెంటనే పోలీసులు 108 వాహనంలో చికిత్స కోసం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను నాగిరెడ్డి కుమారుడు సుబ్బారెడ్డి, కోడలు లక్ష్మీదేవి తెలిపారు. చాపాడు మండలం మొరాయిపల్లె గ్రామానికి చెందిన తిప్పలూరు నాగిరెడ్డికి దువ్వూరు మండలం చింతకుంట రెవెన్యూ గ్రామంలో రెండు ఎకరాల పొల ఉందన్నారు. ఈ పొలానికి సంబంధించి నాగిరెడ్డికి, ఆయన తమ్ముడు రామచంద్రారెడ్డికి తగదాలు ఉన్నాయని చెప్పారు. జాయింట్‌ కలెక్టర్‌ వద్ద, ప్రొద్దుటూరు కోర్టులో ఈ కేసు నడుస్తోందని పేర్కొన్నారు. రెండు ఎకరాల పొలం ఆన్‌లైన్‌లో నాగిరెడ్డి పేరుతోనే ఉందని, ఈ భూమిని తన పేరు మీద ఆన్‌లైన్‌ చేయాలని తిప్పలూరు రామచంద్రారెడ్డి రెవెన్యూ అధికారుల వద్ద మ్యూటేషన్‌కు దరఖాస్తు చేశారన్నారు. ఆ మ్యూటేషన్‌ను రద్దు చేయాలని రెవెన్యూ అధికారులను కోరామని తెలిపారు. కానీ రెవెన్యూ అధికారులు అతని వద్ద లంచం తీసుకుని, అతని పేరున ఆన్‌లైన్‌ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# నగరవనానికి రూ. 1.20 కోట్ల మంజూరు

- త్వరలో పనులు ప్రారంభం
- సీసీఎఫ్‌ రామకృష్ణ



రిజర్వ్‌ ఫారెస్ట్‌ భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో ఏర్పాటు చేయనున్న నగరవనానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరైనట్లు సీసీఎఫ్‌ రామకృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్‌ రామేశ్వరం రిజర్వ్‌ ఫారెస్ట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రామేశ్వరం రిజర్వ్‌ ఫారెస్ట్‌ భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని గతంలో ప్రముఖ న్యాయవాది పుత్తా లక్ష్మిరెడ్డి లోకాయుక్తను ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో లోకాయుక్త ఆదేశాల మేరకు అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు రీ సర్వే చేపట్టారు. రిజర్వ్‌ ఫారెస్ట్‌ భూమి ఎంత మేర ఉందనే విషయాన్ని కోర్టుకు సమర్పించేందుకు సర్వే చేస్తున్నట్లు సీసీఎఫ్‌ తెలిపారు. నగరవనం ఏర్పాటు చేసేందుకు గతంలో గుర్తించిన ప్రాంతంలో ఆక్రమణలు ఉండటంతో పనుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. సమస్య లేని ప్రాంతంలో త్వరలో పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కాగా 1893 గెజిట్‌ ప్రకారం రామేశ్వరం రిజర్వ్‌ ఫారెస్ట్‌లో 1044 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ గెజిట్‌ ప్రకారం పూర్తి స్థాయి భూమిని గుర్తించేందుకు అధికారులు సర్వే చేస్తున్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు నాగార్జునరెడ్డి, సందీప్‌రెడ్డి, డీఆర్‌ఓ లక్ష్మయ్య, ఎఫ్‌ఆర్‌ఓ దినేష్‌కుమార్‌రెడ్డి, ఎఫ్‌బీఓ హరి పాల్గొన్నారు.

# తిప్పలూరు కార్యాలయాల సముదాయం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జేసీ సాయికాంత్‌ వర్మ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయల భవనాల సముదాయాన్ని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ సాయి కాంత్‌ వర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తిప్పలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ సముదాయాలను సీఎం చేతుల మీదుగా ప్రారంభింప చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, ఈఈ శ్యామ్‌సుందర్‌, తహసీల్దార్‌ ఎ.నాగేశ్వరరావు, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ వినయ్‌, హౌసింగ్‌ శాఖ రూరల్‌ ఏఈ నాగజ్యోతి, వెలుగు ఏపీఎం జగదీశ్వరి, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# వృద్ధుడిని ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చి..

రూ.44 వేలు కాజేసిన వైనం

కడప అర్బన్‌ : కడప నగరం రైల్వేస్టేషన్‌ సమీపంలో నివాసముంటున్న రిటైర్డ్‌ ఆర్‌అండ్‌బీ ఉద్యోగి సుబ్బన్నను ఓ వ్యక్తి ఏమార్చి ఏటీఎం కార్డు మార్చి రూ.44 వేలు కాజేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వేశ్వరయ్య సర్కిల్‌ సమీపంలో ఇటీవల ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో డబ్బులను డ్రా చేసేందుకు సుబ్బన్న వెళ్లాడు. ఆ ఏటీఎం మిషన్‌ వద్దనే మరో గుర్తుతెలియని వ్యక్తి అప్పటికే ఉన్నాడు. వృద్ధుడిని ఏమార్చి ఏటీఎం కార్డు తీసుకుని నగదు కాజేసి, తన ఏటీఎం కార్డును వృద్ధునికి ఇచ్చి ఎంచక్కా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత వివిధ ఏటీఎంలకు వెళ్లి రూ.36 వేలు డ్రా చేశాడు. మరుసటిరోజు రూ.8 వేలు డ్రా చేశాడు. దీంతో వృద్ధుడు సుబ్బన్న తన సెల్‌ఫోన్‌కు పదేపదే మెసేజ్‌లు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.